# నేనెవర్ని?

"నేనెవర్ని?"... ఇది ఒక తత్త్వవేత్త ఆత్మ జిజ్ఞాసతో వేసుకుంటున్న ప్రశ్న కాదు. ఒక రుషి సత్తముడు జీవాత్మ, పరమాత్మల అన్వేషణతో వేసుకుంటున్న ప్రశ్న కూడా కాదు. ఒక సామాన్య యువతి తన జీవితాన్ని తరచి చూసుకుంటూ అంతులేని విషాదంతో వేసుకుంటున్న ప్రశ్న. ఒక స్త్రీ సమాజంలో, కుటుంబంలో తన ప్రతిపత్తి ఏమిటి? అని తర్కించుకుంటూ వేసుకుంటున్న ప్రశ్న.

శాంతి మనసులో ఎనిమిదేళ్ళుగా అనుక్షణం ఈ ప్రశ్న సుళ్ళు తిరుగుతూనే ఉంది. ఇప్పుడామె టీనేజ్ కూతురు సంచిత దుఃఖంతో, ఆగ్రహంతో, అవమానంతో జ్వలిస్తూ సంధిస్తున్న ప్రశ్న పరంపరలో ఈ ప్రశ్న విశ్వరూపం దాల్చి ఆమె కళ్ళముందు నిలిచింది.

"మమ్మీ!" మత్తుగా పడుకున్న సంచిత కొద్దిగా కదిలి కళ్ళను బలవంతాన విప్పడానికి ప్రయత్నిస్తూ అమ్మ చేతినందుకుని గట్టిగా పట్టుకుని గుండె కానించుకుంది. ఆ పిలుపులోని ఆర్తి, అభద్రతా భావంతో, అమ్మ దూరమైపోయి తను ఒంటరి పక్షినైపోతానేమోనన్న భయంతో పిలిచిన ఆ పిలుపులోని ఆక్రందన శాంతిని ఒణికింప జేసింది. ఒంగి కూతురుతలను తన బాహువుల మధ్య పొదవుకుని ఓదార్పుగా నిమురుతూంది. అంతలో లోపలికి వచ్చిన ఆమె భర్త శ్రీనివాస్‌ని చూసి సంచిత తలను బెడ్‌పై ఆన్చి లేచి నుంచుంది.

కూతురి ప్రక్కన కూర్చున్న అతని ముఖంలోని అదుర్దాను, వడిలిన పువ్వులా మంచంమీద అస్తవ్యస్తంగా పడివున్న కూతుర్ని చూసి అతను పడుతున్న వేదనను మౌనంగా గమనిస్తూంది. ఎన్నడూ నలతపడని సంచిత ఒక్క రోజులో ఇంత నీరసంగా ఎందుకయిందో శ్రీనివాస్‌కి అర్థం కావడంలేదు. అసలేం జరిగిందో భార్యను అడిగి తెలుసుకోవాలని వుంది శ్రీనివాస్‌కి. కాని శూలాలవంటి ఆమె చూపుల్ని ఎదుర్కోవడం అతనికి సాధ్యం కాదు. అందుకే డాక్టర్ శ్రుతిని అడిగి తెలుసుకుందామని ఆమె దగ్గరకు వెళ్ళాడు.

"సంచిత మానసికంగా బాగా దెబ్బతింది. కారణమేమిటో తెలియదు గాని నిన్న కాలేజినుండి మధ్యలోనే వచ్చేసిందట. వచ్చిన దగ్గర్నుండి పెద్ద పెద్ద అరుపులు, చేతికందినవి విసిరెయ్యడం, పెద్దపెట్టున వెక్కి వెక్కి ఏడుపు. ముందు మత్తు ఇంజక్షనిచ్చి పడుకోబెట్టాము." తండ్రిని విమర్శిస్తూ విస్ఫులింగాలు చిమ్ముతున్న సంచిత కళ్ళు గుర్తుకొచ్చాయి శ్రుతికి. సంచిత కొంచెం కుదుటపడేవరకు అతనామెకంట పడడం మంచిది కాదని, అతనిని చూస్తే ఆమె మరీ రెచ్చిపోవచ్చునని చెప్పింది శ్రుతి.

తనంటే ప్రాణంపెట్టే సంచిత తనను అసహ్యించుకుంటూందనే ఊహనే భరించలేక పోతున్నాడు శ్రీనివాస్. కాని తమ శ్రేయోభిలాషి అయిన శ్రుతి సూచన మేరకు కొంత సమయం దూరంగా వుండడానికే నిశ్చయించుకుని సంచిత అలజడికి కారణమేమిటో తెలుసుకోమని అభ్యర్థించి వెళ్ళిపోయాడు.

తన పని అయ్యాక శాంతిని తన రూమ్‌లోకి పిలిచి సంచిత అలా అవడానికి కారణమేమిటని అడిగింది శ్రుతి. ఒక నిమిషం సేపు అవమానంతో, దూఖంతో తల దించుకుని కూర్చున్న శాంతి తననుతాను కూడదీసుకుని కళ్ళెత్తింది.

"సంచిత ఇలా ఎందుకయిందో చెప్పేముందు కొన్ని విషయాలమీద మీ అభిప్రాయం చెబుతారా మేడమ్?" శాంతి అడిగింది. అంగీకారంగా తలూపి కుతూహలంగా ఆమె వంక

చూస్తూంది శ్రుతి.

"పెళ్ళయి పిల్లలున్న పురుషుడు మరొక పెళ్ళి చేసుకుంటే రెండో ఆమెకు చట్టపరంగా 'భార్య' స్థానం ఉంటుందా?"

"ఉండదు"

"ఉండదు కదా! రెండో ఆమెకు 'మిస్ట్రస్' స్థానమే తప్ప 'మిసెస్' స్థానం ఉండదు. మరొక్క విషయం. బంధు మిత్రుల సమక్షంలో అట్టహాసంగా చేసుకుంటేనే పెళ్ళి అవుతుందా, ప్రేమించుకున్న ఇద్దరు వ్యక్తులు నలుగురు స్నేహితులు శుభాకాంక్షలు చెప్తూ ఉండగా పెళ్ళి చేసుకుంటే అది పెళ్ళి అవదా?"

"ఎంతమంది సమక్షంలో చేసుకున్నా పెళ్ళే. సాక్షుల సంఖ్యను బట్టి పెళ్ళి అయిందా లేదా అనేది నిర్ధారణ చెయ్యముకద!" శాంతి ఈ ప్రశ్నల్ని ఎందుకడుగుతూందో తెలియక తనకు తోచింది శ్రుతి చెప్పింది.

శ్రుతి చెప్పింది వింటూనే ఆలోచనలో పడిన శాంతి కళ్లముందు నిన్న ఎర్రబడిన ముఖంతో నిప్పులు కక్కుతూ వచ్చిన సంచిత రూపం నిలిచింది. సీనియర్ ఇంటర్ చదువుతున్న సంచితతో ఫ్రెండ్స్ జూనియర్స్‌లో క్రొత్తగా జాయినయిన ఒకమ్మాయి సంచితను పోలి వుందని చెప్పేసరికి కుతూహలంతో ఫ్రెండ్స్‌ని వెంటబెట్టుకుని ఆమెను కలిసింది సంచిత. పరస్పర పరిచయాలయేసరికి అందరినీ విభ్రాంతిలో ముంచిన విషయం ఒకటి బయటపడింది. తామిద్దరి తండ్రి ఒకరేనని తెలిసి షాక్ తింది సంచిత. "శాంతి పాలిమర్స్ అధినేత శ్రీనివాస రావుగారు మా నాన్నగారు, మీ నాన్నగారెలా అవుతారు?" అంటూ ఆ అమ్మాయి పై నిప్పులు చెరిగింది సంచిత. కాని శ్రీనివాస్ గురించి ఆ అమ్మాయి చెప్పిన వివరాలు విన్నాక ఆ చేదు నిజాన్ని నమ్మక తప్పలేదు.

తన తండ్రి ప్రేమ తనొక్కదానికే స్వంతం అని గర్విస్తున్న సంచిత తన ఈడుపిల్లే మరొక వాటాదారు ఉందని తెలిసే సరికి తట్టుకోలేక పోయింది. దానికి తోడు పుండుమీద కారం చల్లినట్లుగా ఫ్రెండ్స్ వెటకారపు నవ్వులు, వ్యంగ్య బాణాలు తనతల్లిని, తమను మోసంచేసిన తండ్రి మీద ఉవ్వెత్తున లేచిన కోపంతో జ్వలిస్తూ ఇంటికి వచ్చింది. ఎనిమిదేళ్ళుగా పిల్లలకీ విషయం తెలియకుండా మభ్యపెడుతూ శాంతి రహస్యంగా మోస్తున్న నిప్పుల కుంపటిని ఒక్క తోపు తోసింది సంచిత. తండ్రి ఇంట్లో లేనప్పుడల్లా ఊరికెళ్ళారని తమకు అబద్ధం చెబుతూ తండ్రి చేస్తున్న నిర్వాకాన్ని దాచినందుకు, అంత అవమానకరమైన స్థితిలో తల్లి జీవిస్తున్నందుకు మండిపడింది సంచిత.

రవ్వంత కష్టంకూడా తెలియకుండా పెరిగిన సంచిత, జీవితమంతా అనురాగాలు, ఆప్యాయతలతో గడిచిపోతుందని ఆశిస్తున్న సంచిత, జీవితపు మరోకోణాన్ని దర్శించడంతో

ఆమె రంగుల స్వప్నం చెల్లాచెదురయింది. భగ్నమైన కలలు ఆమెను ఉన్మత్తురాలిని చేశాయి. "పాపం అందుకే అంతగా అప్సెట్ అయింది" శాంతి చెప్పింది విని జాలిపడింది శ్రుతి.

"ఎనిమిదేళ్ళక్రితం మొదటిసారి నాకీ విషయం తెలిసినప్పుడు నేనూ అంతకంటే ఎక్కువగా అప్సెట్ అయ్యాను డాక్టర్ గారూ! నన్ను పెళ్ళి చేసుకోవడానికి రెండేళ్ళ ముందే ఆయనకు పెళ్ళయిందని, ఒక బిడ్డకూడా ఉందని, మా పెళ్ళయ్యాక ఆమెకు మరో ఇద్దరు పిల్లలు పుట్టారని తెలిసిన రోజున నేను ప్రేమ మీద, పరస్పర విశ్వాసం మీద, వివాహ వ్యవస్థమీద పెట్టుకున్న నమ్మకాలు కుప్పకూలిపోయాయి. నాకలలు, ఆశలు, ఇష్టాలు, అన్నిటినీ నా భర్తతో పెనవేసుకుని అతను, పిల్లలు తప్ప మరో ప్రపంచం ఎరుగకుండా బ్రతుకుతున్న నేను కళ్ళు తెరచి చూసేసరికి కనిపించింది పునాదేలేని మా వివాహ బంధం, త్రిశంకుస్వర్గంలా ఉన్న నా బ్రతుకు" ఎంత నిగ్రహించుకుందామని ప్రయత్నించినా శాంతి కంఠం గద్గదమయింది.

"ఇది నీ ఇల్లు. నువివ్వతని భార్యవు. ఈ స్థానం నీదే. మగవాడు బయట సవాలక్ష సంబంధాలు పెట్టుకుంటాడు. ఇంటి ఇల్లాలు యాగీచేసి కుటుంబం పరువును బజారున పెట్టకూడదు". అత్తగారు చెప్పిన హితవు విని నేను కోపంతో దహించుకుపోయాను. వివాహ బంధంలో భార్యకు పాతివ్రత్యపు కట్టడి పెడుతూ భర్తను బయట సవాలక్ష సంబంధాలు పెట్టుకోవడానికి అనుమతించే సంప్రదాయాన్ని గౌరవించదలచలేదు నేను. నేను తెచ్చేకట్నకానుకలకోసం మోసంతో నా గొంతుకోసిన నా భర్త, అత్తమామల్ని ఖండ ఖండాలుగా నరకాలన్నంతగా ఉబికిన ఉద్రేకాన్ని అణచుకున్నాను.

ఆవేశం చల్లబడ్డాక, నింపాదిగా ఆలోచించాను. నేను తెచ్చిన ఆస్తిని పెట్టుబడిగా పెట్టే ఈ సంపాదనంతా ఈయన సంపాదించింది. నేను కోరుకున్న మరుక్షణాన నా పేరనున్న ఆస్థులన్నిటినీ నేను వశం చేసుకోగలను. వాటిని నిర్వహించుకోగలిగే ఆత్మస్థైర్యం కూడా నాకుంది. కావాలనుకుంటే, భ్రమగా మిగిలిపోయిన కాపురాన్ని కాలదన్ని నా పిల్లల్ని తీసుకుని నేను వెళ్ళిపోగలను అనుకున్నాను. కాని ఆచరణలో అది సాధ్యం చేసుకోలేకపోయాను.

మగపిల్లలిద్దరూ బాగానే వున్నారు కాని, మా అమ్మగారింట్లో ఒక నెల రోజులు ఉండేసరికి సంచిత తండ్రి మీద బెంగతో వెళ్ళిపోదామని పేచీ పెట్టింది. అది వేసే యక్ష ప్రశ్నలకు నేను సమాధానం చెప్పలేకపోయేదాన్ని. ఒకవైపు అమ్మానాన్నల హితబోధ. అక్కడనుండి కూడా వెళ్ళిపోయి విడిగా ఉందామనుకునేంతలో సంచిత జబ్బు పడింది. తండ్రికోసం కలవరింతలు, ఏడుపు, చివరకు సంచిత కోసం నేను దిగిరాక తప్పలేదు. ఎంత అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ ఈ కాపురానికి అంటిపెట్టుకుని ఉండక తప్పలేదు. శాంతి చెప్పేది వింటున్న శ్రుతికి ఆశ్చర్యం కలగలేదు.

"ఏ మగాడికైనా వివాహేతర అనుబంధాలు లేకపోతే అపురూపంగా అనుకోవాలి గాని

ఉంటే ఆశ్చర్యపోనక్ఖర్లేదు. మగవాడికి సమాజం కట్టబెట్టిన ఈ వెసులుబాటుని ఆకర్షణీయం చేస్తున్న సినిమాలు, టి.వి., సాహిత్యం పురుషుడి ఈ ప్రవర్తన సహజం, ఆమోదయోగ్యమైనది అనే భ్రమల్ని కల్పిస్తున్నాయి'' విచారంగా అనుకుంది శ్రుతి.

"మరో స్త్రీతో నా భర్తను పంచుకునేందుకు ఎదురు తిరుగుతున్న మనసు ఒక ప్రక్క, అతని నుండి శాశ్వతంగా విడిపోవడానికి ఆటంకంగా ఉన్న నా పిల్లలు మరో ప్రక్క, అనుక్షణం నన్ను చిత్రహింస పెడుతున్న మోసపోయాననే భావం వేరొక ప్రక్క నన్ను నలిబలి చేశాయి. కొంచెం తేరుకున్నాక నేను ఈ ఇంట్లో మసిలే పిల్లల తల్లిగానే జీవిస్తున్నాను తప్ప అతని భార్యగాకాదు. ఇది నా పొగరు బోతుతనంగానో, పిచ్చిగానో కనిపించవచ్చు. కాని నా స్థితిలో ఉండే కొంత మంది స్త్రీలలా నేను రాజీపడిపోయి ప్రేమ, నమ్మకం లేని వివాహబంధంలో ఏమీ జరగనట్లు నటిస్తూ ఇమడలేకపోయాను. అతని పశ్చాత్తాపాలు, వేడుకోళ్ళు, వాగ్దానాలు, బెదిరింపులు, ఏవీ నన్ను కదిలించలేక పోయాయి. మనసుతో ప్రమేయంలేని కేవల దైహికబంధాన్ని కొనసాగించలేకపోయాను''. తన హృదయంలోని వ్యథను అన్ని సంకోచాల్ని వదిలి వెల్లడిస్తూంది శాంతి. పైకి ఎంతో నిబ్బరంగా, హుందాగా కనిపించే శాంతి గుండెలో దాగివున్న సంఘర్షణను చకితయై వింటూంది శ్రుతి.

"తమ అనుమతి, ఇష్టం లేకుండా పెళ్ళి చేసుకున్న ఆమెను కొంత డబ్బు పడేసి వదిలించుకోమని కొడుకుకు సలహానిస్తున్న అతని తల్లి దండ్రుల దౌష్ట్యం నన్ను మరింత బాధించింది. తమ కొడుకుతో జీవితం కోసం సర్వస్వం వదిలేసి వచ్చి పెళ్ళి చేసుకుని పిల్లల్ని కన్న కోడల్ని ఒదిలించుకోమని ఒత్తిడి చేయడం అన్యాయమని వీళ్ళకు అనిపించడం లేదా అని ఆవేశపడ్డాను. వాళ్ళ దుర్మార్గపు ఆలోచనల్ని ప్రతిఘటించి ఆమెకు అపకారం జరగకుండా చేయగలిగాను. కాని ఇన్నేళ్ళుగా నన్ను నేను ప్రశ్నించుకుంటూనే వున్నాను నేనెవర్ని? మిస్టర్ శ్రీనివాస్ 'మిసెస్'నా? 'మిస్ట్రెస్'నా?"